# దహనం

**ప్రతాప రవిశంకర్**

అమావాస్య రోజులు, చిమ్మ చీకటి-చీకటిని చీల్చుకుంటూ ముందుకు పోతోంది ఫోర్డు లారీ. దొంకరోడ్డు గతుకులుగా వుంది. లారీ పైకీ-కిందికీ అదురుతోంది.

బిక్కు బిక్కుమంటూ-ఇంకో నిమిషంలో ఉరి తీయబడబోతున్న మనుషుల్లా లారీ బాడీలో నిల్చున్నారు కోటేశు-రామసీత.

ఇద్దరూ కొత్త దంపతులు - రెండు నెలల క్రితం వాళ్ళిద్దరికీ పెళ్ళయింది. కోటేశు బీడీ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు.

కంతలోనించి కాబిన్‌లోకి చూశాడు-డ్రైవరూ, క్లీనరూ-గుసగుసలాడుకుంటున్నారు.

కోటేశు-రామసీత భయంతో బిగుసుకు పోయేరు-ప్రాణభీతి కలిగింది.

ఒకరి దగ్గరకు మరొకరు జరిగారు.

"ఏం చేద్దాం?" అన్నాడు కోటేశు భయంగా.

"భయంగా వుంది" అన్నది రామసీత.

"భయపడకూడదు....ఇటువంటప్పుడే ధైర్యంగా వుండాలి" అన్నాడు కోటేశు, భార్య భుజం తడుతూ.

నిమిషంపాటు ఆలోచించి "చీర తీసెయ్" అన్నాడు.

నిర్ఘాంత పోయింది రామసీత.

"ఇదేంకోరిక?" అన్నట్లు చూసింది.

భార్య ఉద్దేశాన్ని గ్రహించిన కోటేశు "ఇంత స్పీడుగా వెళుతున్న లారీలోనించి నువ్వుదూకలేవు....అందుకే చీర తీసెయ్ దాన్ని నీ నడుముకు కట్టి కిందికి వదులుతాను" అన్నాడు భార్య చెవిలో రహస్యంగా....

కళ్ళు పెద్దవి చేసింది రామసీత....

ఇక ఆలస్యం చెయ్యలేదు. గబగబా చీరను లాగేసింది. ముడి విప్పదీసింది.

కేవలం లోపలి లంగా....జాకెట్టుమీదే వుంది రామసీత, సిగ్గుపడలేదు. ప్రాణాలే పోయే పరిస్థితి వస్తుంటే సిగ్గెందుకూ?

కోటేశు చీరను భార్య నడుముకు ముడివేశాడు....రెండోవైపు తన గుప్పిటతో పట్టుకున్నాడు. ఇద్దరూ అంచుకు నడిచారు.

"ఊ....ఎక్కు" తొందర చేశాడు కోటేశు....

"నువ్వో" భయంగా అడిగింది రామసీత.

"నేనూ దూకుతా"

చెక్కమీదికి ఎక్కింది....

"చేతులు వదిలెయ్"

వదిలేసింది.

క్రమంగా చీరను వదిలాడు కోటేశు. రామసీత నేలను తాకింది.

కోటేశు నిమిషం కూడా ఆలస్యం చెయ్యలేదు. చెక్కమీదికి ఎక్కి కిందికి దూకాడు.

వేగంగా వెడుతోంది లారీ....

లారీ లైట్లు చీకటిని కోస్తున్నాయి....

వెనక్కి పరుగు దీశాడు కోటేశు....

రోడ్డుమీద నుల్చున్న రామసీతను కలిశాడు.

ఒక్కసారి ఇద్దరూ చుట్టూ కలియ జూశారు

పైర్లు కోయడంవల్ల ఖాళీగా వున్న పొలాలు....అక్కడా అక్కడా చిన్న చిన్న చెట్లు....

దూరంగా పొలంలో లీలగా ఓ పాక బయట దీపం కనిపించాయి.

అంతే, కోటేశు-రామసీత చెయ్యి పట్టుకుని ముందుకు దూకాడు.

పరుగులంకించుకున్నారు.

మధ్యలో వెనక్కి తిరిగి చూశాడు కోటేశు.

లారీ ఆగిపోయింది.

కోటేశు గుండెలు అదిరాయి....

* * *

కూతురిని-అల్లుడిని పండక్కి బయ ల్దేరి రమ్మని ఉత్తరం రాశాడు కోటేశు మామ. మరురోజే పండుగ. కోటేశుకు సెలవు దొరకలేదు. పండుగ మరురోజే మళ్ళీ ఫ్యాక్టరీకి వెళ్ళాలి. కేవలం ఒక్క రోజే సెలవు....అందుకే ఫ్యాక్టరీ నించి రాగానే భార్యతో బయల్దేరాడు. రామసీతది ఓ పల్లెటూరు.

ప్రైవేటు బస్సులో వెళ్లాలి. రాత్రి తొమ్మిది గంటలకు బయల్దేరింది బస్సు. అదేలాస్టు బస్సు....అందువల్ల ఎక్కువ మంది ప్రయాణీకులు లేరు.

ఇంకా వూరు ఎనిమిదిమైళ్ళు వుండ వగా చెడిపోయింది బస్సు. కోటేశు-రామ సీత-మరో ప్రయాణీకుడూ వున్నారు బస్సులో....

డ్రైవరు-ఇంజనుతో అరగంట కుస్తీ పట్టినా ప్రయోజనంలేకుండా పోయింది."తెల్లారిందాకా కదల్దు అన్నాడు ఓవరికి....

వారిద్దరికీ ఏం చెయ్యాలో తెలీ లేదు....

బస్సులో పడుకుందామన్నాడుకోటేశు. ఎట్లాగైనా రాత్రికి ఇల్లు చేరాలని రామ సీత కోరిక.

మూడో ప్రయాణీకుడు బస్సులోనే పడుకున్నాడు.

ఇలా ఆలోచిస్తుండగానే దూరంనించి వస్తున్న లారీ కనిపించింది

"అపుదామా?" అన్నాడు కోటేశు.

తలవూపింది రామసీత.

దగ్గరకు వచ్చింది లారీ.

చెయ్యెత్తి ఆపాడు కోటేశు.

"పాలెంవైపు వెళుతుందా?" అడి గాడు.

"ఆ" అన్నాడు క్లీనరు.

"ఎంత?"


"బస్సు చార్జీయే" డ్రైవరు అన్నాడు, సరేనన్నట్టు తలవూపాడు కోటేశు.

"బాడీలో ఎక్కండి" అన్నాడు క్లీనరు.

ముందు కోటేశు ఎక్కి - తర్వాత రామసీతను లోపలకు లాగాడు.

లారీ కదిలింది.

కొంతసేపటి తర్వాత తన మెళ్ళో వున్న బంగారు తాడును - ఇంకో గొలు సును - కోటేశు చేతికివున్న వాచీ, వుంగరాన్ని చూసిన రామసీతకు భయ




మేసింది.

ఏదో ఆలోచన వచ్చింది.

'డ్రైవరూ - క్లీనరూ లారీ ఆపి తమ ఇద్దరినీ చంపి సొమ్ములను కాజేస్తే.'

రామసీత గుండె బరువెక్కింది. తన ఆలోచనను భర్తకు చెప్పింది. అతనూ భయపడ్డాడు. పొరపాటు చేశామన్నాడు.

ఇంతకుముందు అలాంటి సంఘటనల గురించి విన్నాడు.

కాబిన్‌లోకి చూశారు.

డ్రైవరూ - క్లీనరూ సీరియస్‌గా మాట్లాడు కుంటున్నారు, వారి మాటలు అస్పష్టంగా వున్నాయి.

చెవులు రిక్కించా రిద్దరూ.

"ఎక్కడ ఆపుదాం" క్లీనరు అడుగు తున్నాడు.

"రోడ్డుమీదయితే ఏదైనా బండి ఎదు రొస్తుందేమో! చింతల తోపులోకి పోనిచ్చి ఆపుదాం."

"పారిపోరుగదా" అనుమానం వెలి బుచ్చాడు క్లీనరు.

"ఎక్కడికి పోరు! మనకు చిక్కినట్టే" నవ్వాడు డ్రైవరు.

భయంతో వణికిపోయేరు.

* * *

కాలిన త్తువకొద్దీ ముందుకు పరుగు తీస్తున్నారు. గట్టుతగిలి ముందుకు పడింది రామసీత.... లేవదీశాడు కోటేశు.

మరో వందగజాల దూరంలో పాక.

పాకదగ్గరకు చేరుకున్నారు.

బయట నులకమంచంమీద పడుకుని చుట్టకాల్చుకుంటున్నాడు ఓముసలాయన. ఆయనకు అరవైయేళ్ళుంటాయి. బట్ట తల, నెరిసిరిగిన మీసాలు, వంటికి చొక్కా లేదు. పంచెకట్టుకున్నాడు. ఆయన పేరు రాజయ్య....

చప్పుడు విని లేచి కూర్చున్నాడు.

ఎదురుగా వీళ్లిద్దరూ.

చెమటలు కక్కుతున్న దంపతులు, చీరలేని రామసీత.

"ఎవరు మీరూ ! ఏంజరిగింది? అర్ధ రాత్రివేళ ఎందుకిలా ప రి గె త్తు తూ వచ్చారు?" క ం గా రు గా అడిగాడు రాజయ్య.

"బస్సు చెడిపోతే లారీలో వస్తున్నాం, డ్రైవరూ - క్లీనరూ చింతల తోపులో మమ్మల్నిచంపి నగలు కాజెయ్యాలను కుంటున్నారు, దూకి వచ్చాం. వెనక వాళ్ళు వస్తున్నారు. మమ్మల్ని ఎక్కడైనా దాచెయ్ తాతా" అన్నాడు కోజేశు ఆత్రుతగా.

రాజయ్య జరిగింది గ్రహించాడు. "రండి" అంటూ పాక వెనక్కి తీసు కెళ్ళాడు.

గాడివుంది. అక్కడ రెండు ఎద్దులు నిలబడి గడ్డిమేస్తున్నాయి. అక్కడికి తీసుకెళ్ళాడు.

"గాట్లో పడుకోండి" అన్నాడు.... ఇద్దరూ నేలమీద పడుకున్నారు.... వెంటనే వెళ్ళి పాకలోనించి ఎండుగడ్డి తీసుకొచ్చి వారి మీద కప్పాడు....

"నేనూ పిల్చే వరకు రావద్దు" అని పాక దగ్గరకు వెళ్ళి మంచంమీద కూర్చు న్నాడు రాజయ్య చుట్ట కాలుస్తూ....

రాజయ్య రోజూ రాత్రిళ్ళు ఆ పాక లోనే పడుకుంటాడు.

రెండు నిమిషాలయ్యేసరికి పాక వైపుగా పరిగెత్తుకు వస్తున్నఇద్దరు మను షులు కనిపించారు.

వాళ్ళే డ్రైవరూ-క్లీనరూ అనుకు న్నాడు రాజయ్య....

మరో నిముషంలో పాక దగ్గరకు వచ్చారిద్దరూ....మంచం మీద లేచి కూర్చున్నాడు రాజయ్య.

వారిద్దరూ ఆయాసంతో రొప్పు తున్నారు.

చూరుకు వేల్లాడుతున్న లాంతరు వెలుతురు వారి మీద మసగ్గా పడింది.

"నువ్వా !" అన్నాడు రాజయ్య డ్రైవరును గుర్తించి ఆశ్చర్యంతో....

"అవును....నేనే"అన్నాడుడ్రైవరు.

అతని పేరు నరసింహం....

"నువ్వు చిన్న చిన్న దొంగతనాలే చేస్తున్నావనుకున్నానుగాని ఇటువంటి దుర్మార్గపుపనులు చేస్తున్నావనుకోలేదు" అన్నాడు రాజయ్య.

క్లీనరు ఆశ్చర్యంగా ఇద్దరికేసీ చూస్తు న్నాడు....

నరసింహం-రాజయ్య మేనల్లుడు.... పదేళ్ళ వయసులో ఏదో ప్రమాదంలో నరసింహం తల్లిదండ్రులుపోతే-అతన్ని తన యింటికి తీసుకొచ్చి చదువు చెప్పిం చాడు రాజయ్య....కాని అతనికి చదువు రాలేదు. చిన్నతనం నించే దొంగతనాలు మొదలు పెట్టాడు ఏడేళ్ళ క్రితం దొంగ తనం కింద జైలుకు వెళ్లాడు.ఆ తర్వాత ఇంటికి తిరిగి రాలేదు.

"నాకు నీకు మాటలు అనవసరం.... ఇటువైపు ఇద్దరు పారిపోయివచ్చారు... వాళ్ళను ఎక్కడ దాచావో చెప్పు" గర్జిం చాడు నరసింహం.

"నాకు తెలీదు" మొండిగా అన్నాడు రాజయ్య....

"చెప్పకపోతే చంపేస్తా" అంటూ ముందుకు వచ్చాడు నరసింహం....

"ఆగు" అన్నాడు రాజయ్య...."నువ్వు మూర్ఖుడివని నాకు తెలుసు...అనవసరంగా నా ప్రాణాలెందుకు బలివ్వాలి? ఆ పాకలో గడ్డిగుప్ప వెనుక దాచాను" అన్నాడు....

అంతే....ఇద్దరూ ఆత్రుతగా పాక గొళ్ళెం తీసుకుని లోపలకు పరుగు దీశారు....లోపలంతా చీకటి....

దిగ్గున ముందుకు వురికాడు రాజయ్య. గభాలున తలుపులను లాగి గొళ్ళెం పెట్టాడు....

జరిగిన మోసం గ్రహించి తలుపులు బాదుతున్నారు. నరసింహం—క్లీనరు....

రాజయ్య గుండె మండుతోంది....

ఇలాంటి దుర్మార్గులు బతికినందువల్ల ఎవరికీ ఉపయోగం లేకపోగా ఎంత మంది జీవితాల్లో నాశనం చేస్తారు.... వీళ్ళు బ్రతకటం ప్రమాదం....వీళ్ళకి కోర్టులు సరైన శిక్షలు విధించవు.

ఆ ఆలోచన రాగానే చూరున వేల్లాడుతున్న లాంతరు తీసి-మూత తీసి - కిరోసినాయిలును పాకమీద కుమ్మరించాడు మంచంమీది అగ్గిపెట్టె తీసుకొచ్చి-గీసి పాక మీద అంటించాడు.

భగ్గున లేచింది మంట.

వానకు తడిసి-ఎండకు ఎండిన పాక మీద రెల్లుగడ్డి తాటాకులా మండుతోంది. పైకి ఎగపాకుతున్నాయి మంటలు.

కేకలు పెడుతున్నారు డ్రైవరూ-క్లీనరూ - బ్రతిమిలాడుకుంటున్నారు....




తలుపులు మోగిపోతున్నాయి.

పాక వెనక్కు వెళ్ళాడు రాజయ్య....

గాదిన వున్న గడ్డితీసి "లేవండి" మీ కింకా భయంలేదు" అన్నాడు.

ఇద్దరూ లేచి విచ్చివి గడ్డి దులుపుకుంటూ చూశారు.

పాక మండుతోంది.

"మాటలు" ఏదో అడగబోయేడు కోటేశు.

"ఆ దుర్మార్గులిద్దరూ లోపలవున్నారు. గొళ్ళెం పెట్టి నేనే అంటించాను"

విస్తుబోయేరు కోటేశు-రామసీత.... వాళ్ళకు మాటరాలేదు....రాజయ్య వారికి దేవుడిలా కనిపించాడు....

"నువ్వు దేవుడివి తాతా" రాజయ్య కాళ్ళమీద పడ్డాడు కోటేశు....తనూ కిందికివొంగింది రామసీత కృతజ్ఞతతో....

దురాశను - దుర్మార్గాన్ని దహించి వేస్తున్న మంటలను చూస్తూ గర్వంగా మీసాలు మెలివేశాడు రాజయ్యతాత.

అనామిక